సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అన్యాయంగా తమపై కేసులు పెడతారా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. -8లో



క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

జిల్లాలో గురువారం 24.0 – 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్



పెద్ద దర్గా ఉరుసుకు వేళాయె

రేపటి నుంచి పెద్ద దర్గా ప్రధాన ఉరుసు

- వారం రోజులపాటు నగరం కళకళ
- పూర్తయిన ఏర్పాట్లు

కడప కల్చరల్: ఆధ్యాత్మిక చింతనకు...మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న కడప పెద్ద దర్గా (అమీన్ పీర్ దర్గా) ఉరుసుకు వేళయింది. ప్రశాంతతకు నిలయంగా జాతీయ స్థాయిలో ఖ్యాతి గాంచిన ఈ దర్గా గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. శనివారం నుంచి ఈ నెల 21వరకు జరిగే ప్రధాన ఉరుసు ఉత్సవాలకు దర్గా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే విద్యుద్దీప శోభతో ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉత్సవ కాంతులను వెదజల్లుతోంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతోంది.

విలక్షణ సూఫీ ఆధ్యాత్మిక కేంద్రం

ఈ దర్గాకు సంబంధించిన ప్రథమ సూఫీ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మహమ్మద్ చిష్టివుల్‌ఖాద్రి కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి 16వ శతాబ్దంలో ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ ఈ ప్రాంతానికి వచ్చారు. సూఫీ తత్వాలతో ప్రజల్లో దైవ చింతనను పెంచిన ఈయనకు నాటి కడప నవాబులు ప్రియ శిష్యులుగా ఉండేవారు. ఆయన వారసునిగా ప్రస్తుతం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ 11వ పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. దర్గాపై అపార విశ్వాసం గల భక్తులు మన దేశంతోపాటు పాకిస్తాన్, గల్ఫ్ దేశాలలో కూడా ఉన్నారు.

సామాజిక సేవలు

కేవలం ఆధ్యాత్మిక చింతనతోపాటు దర్గా ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. పేద యువతులకు కుట్టు, అల్లికల్లో శిక్షణ, యువకులకు ఐటీఐ ద్వారా వృత్తి విద్య అందిస్తున్నారు. దర్గాకు సమీపంలో నిరుపేద, ప్రతిభ గల విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఆధునిక విద్య నేర్పే పాఠశాలలను నెలకొల్పి విద్యాదానం చేస్తున్నారు.

- అన్ని మతాలకు చెందిన వారు దర్గాను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో దర్గా పరిసరాల్లో ఉన్న ఇతర మతాలకు చెందిన ప్రార్థనాలయాలను కూడా ఉరుసు సందర్భంగా మరమ్మతులు చేసి నూతనంగా తీర్చిదిద్దడం విశేషం.



కడప పెద్దదర్గా

మహిమాన్విత క్షేత్రం



దర్గాలోని గురువుల మజార్లు

కడప నగరంలోని అమీన్‌పీర్ (పెద్ద) దర్గాకు జాతీయ స్థాయిలో విశిష్టమైన ఖ్యాతి ఉంది. 63 ఏళ్లపాటు కఠోరమైన తపస్సు చేసిన గురువు ఇక్కడ జీవసమాధి కావడంతో మహిమాన్విత క్షేత్రంగా పేరుగాంచింది. ఈ దర్గాలో ప్రార్థనలు చేసి తమ సమస్యలు పోవాలని కోరుకుంటే తప్పక మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఏటా జరిగే ఉరుసు ఉత్సవాలలో ముస్లిమేతరులు కూడా విశేష సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ దర్గా మతసామరస్యానికి, జాతీయ సమైక్యతకు మారుపేరుగా నిలుస్తోంది.

న్యూస్‌రీల్

నేడు ధ్రువపత్రాలతో హాజరుకావాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరపాలక పరిధిలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, లాంగ్వేజ్ పండిట్లకు పాఠశాల సహాయకులుగా పదోన్నతులకు సంబంధించి ఉమ్మడి సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. ఆయా సెకండరీ గ్రేడ్ టీచర్లు, లాంగ్వేజ్ పండిట్లు తమ ఒరిజినల్ విద్యార్హతల ధ్రువపత్రాలతోపాటు సేవా పుస్తకంలో 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్దకు వ్యక్తిగతంగా హాజరై తమ విద్యార్హతలు, సేవా పుస్తకాలను వెరిఫై చేయించుకోవాలని డీఈఓ మీనాక్షి తెలియచేశారు.

రేపు వైవీయూలో 'యువ ఉత్సవ్'

వైవీయూ: భారత ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ మార్గదర్శనంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 16న యోగివేమన విశ్వవిద్యాలయంలో 'యువ ఉత్సవ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల లోపు గల యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 'ఇండియా–2047' అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాలలో వక్తృత్వ పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్, సైన్స్ మేళా సింగిల్ గ్రూప్ ఫోటోలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 80088 19556 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం డిగ్రీ, ఎల్.ఎల్.బి సెమిస్టర్‌ల పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. కృష్ణారావు, సహాయ నియంత్రణ అధికారి డాక్టర్ కె. శ్రీనివాసరావుతో కలిసి విడుదల చేశారు. వైవీయూలోని తన చాంబర్లో ఫలితాల విడుదల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్.ఎల్.బి (ఫైవ్ ఇయర్స్) రెండో సెమిస్టర్‌లో 113 మంది హాజరు కాగా 67 మంది ఉత్తీర్ణత సాధించారు. 59.29 శాతం నమోదయింది. నాలుగో సెమిస్టర్ లో 87 మంది హాజరు కాగా 9 మంది, ఆరో సెమిస్టర్ లో 79 మంది హాజరు కాగా 59 మంది, ఎనిమిదో సెమిస్టర్ లో 73 మంది పరీక్షకు హాజరు కాగా 53 మంది, పదో సెమిస్టర్ లో 122 మంది పరీక్ష రాయగా 108(88.52 శాతం) మంది పాసయ్యారని వెల్లడించారు.

ప్రారంభమైన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తదితరులు

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. కడప నగరంలోని రాధాక్రిష్ణ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, రొమ్ము, నోరు, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలను ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహిస్తారని తెలిపారు. ఉచితంగా నిర్వహించే ఈ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్, అర్బన్ నోడల్ ఆఫీసర్ ఉబేదుల్లా, డాక్టర్ సుమధుర, ఎంఓ ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అనుసంధానంపై నీలినీడలు!

- టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ఆగిన పనులు
- తాజాగా అయాచిత లబ్ధిపేరుతో విచారణకు ప్రభుత్వం ఆదేశం
- వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు మహత్తర పథకం గాలేరు–నగరి, హంద్రీ–నీవా అనుసంధానం
- రూ.4,373.23 కోట్ల పథకంలో రూ.961 కోట్ల పని పూర్తి
- పథకం ఆపితే మూడు జిల్లాలపై సాగు, తాగునీటికి తీవ్ర ప్రభావం
- కృష్ణా జలాలు అందక రిజర్వాయర్లు ఎండాల్సిందే



వైఎస్సార్‌జిల్లా తక్కెళ్లపల్లె వద్ద ఆగిపోయిన ఎత్తిపోతల పనులు

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన హంద్రీ–నీవా, గాలేరు–నగరి సాగునీటి ప్రాజెక్టుల అనుసంధాన పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చురుగ్గా సాగుతున్న పనులకు బ్రేక్ పడింది. పనులపై ప్రభుత్వ కక్ష సాధింపు నిర్ణయాలకు ఈ ప్రాజెక్టు బలవుతుందా లేక రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొనసాగిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. మరోవైపు ఈ ప్రాజెక్టు పనులకు గత ప్రభుత్వం కాంట్రాక్టు ఏజెన్సీకి అయాచిత లబ్ధి ఏమైనా చేకూరిందా అన్న కోణంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించడం చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

- వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు కృష్ణా జలాలను తరలించి సస్యశ్యామలం చేసే ఈ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టగా మొన్నటి దాక పనులు ముమ్మరంగా జరిగాయి. 2021 జూలై 4న తంబళ్లపల్లె నియోజకవర్గం నాయనచెరువుపల్లె వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. పథకం పనులకు గత ప్రభుత్వం రూ. 5,030 కోట్లు మంజూరు చేయగా టెండర్ల ద్వారా రూ.4,373.23కోట్లకు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ పనులు త్వరితగతిన సాగుతుండగా ఐదునెలలుగా ఆగిపోయాయి. ఇది పూర్తయితే హంద్రీనీవా ప్రాజెక్టు ఉపకాలువలు, ప్రధాన కాలువ, ప్రధాన రిజర్వాయర్లకు కృష్ణాజలాలు పుష్కలంగా అందుతాయి.
- అన్నమయ్య, చిత్తూరు జిల్లాకు 1,550 క్యూసెక్కుల కృష్ణా నీటిని తరలించి 20 టీఎంసీలను సద్వినియోగం చేసుకోవాలన్న మహత్తర పథకం ఇది. జీఎన్ఎస్ఎస్- హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకంగా పిలవబడే ఈ పథకం ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి నీటిని వినియోగించుకునే లక్ష్యంలో 13 టీఎంసీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు దక్కుతాయి.

రూ.961 కోట్ల పనులు

రూ.4,373.23కోట్ల అనుసంధాన పనుల్లో ఇప్పటివరకు రూ.961 కోట్ల పని జరిగింది. ఇందులో రూ.145 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా పెండింగ్‌లో పెట్టింది. జరిగిన పనుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలంలో 500 మీటర్ల పైప్‌లైన్, ములకలచెరువు మండలంలో 12 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో ఐదు కిలోమీటర్లు పని జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు వద్ద పుంగనూరు ఉపకాలువలోకి నీటిని తరలించేలా గ్రావిటీ కాలువ 500 మీటర్లు తవ్వారు. గాలేరు–నగరి నుంచి కృష్ణా జలాలు హెచ్ఎన్ఎస్ఎస్ పుంగనూరు ఉపకాలువలోకి నీళ్ల డెలివరీ సిస్టం లింక్ పనులు పూర్తయ్యాయి. వైఎస్సార్ జిల్లాలో గండికోట రిజర్వాయర్ నుంచి నీటిని తరలించి నింపే 0.225 టీఎంసీ సామర్థ్యం కలిగిన కాలేటివాగును 1.20 టీఎంసీల రిజర్వాయర్ సామర్థ్యానికి పెంచి నిర్మాణం పూర్తి చేశారు. ఇక్కడి నుంచి 55 కిలోమీటర్ల పైప్‌లైన్ పని జరిగింది. తర్వాత కల్లూరుపల్లె రిజర్వాయర్ పనిని పూర్తి చేశారు. కాలేటివాగుకు నీటిని తరలించేందుకు దీనికి ముందు నిర్మించాల్సిన 5.5 కిలోమీటర్ల టన్నెల్ పనుల్లో 700 మీటర్ల పని జరిగింది. కొంతమేర ఎత్తిపోతల పనులు జరిగాయి. కల్లూరివారి పల్లె ఎత్తిపోతల నుంచి నీటిని అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు ద్వారా ములకలచెరువు మండలం మీదుగా పీటీఎం మండలంలోని పుంగనూరు ఉపకాలువలోకి నీటిని తరలిస్తారు. మరో మార్గం ద్వారా పెద్దమండ్యం మండలంలోని హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని అందిస్తారు.

23 శాతం అయితే రద్దా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు 25 శాతంలోపు ఉంటే వాటిని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ లెక్కన అనుసంధాన ఎత్తిపోతల పథకం పనులు 23 శాతం పూర్తయ్యాయి. అంటే ఈ పథకాన్ని రద్దు చేస్తారా లేక కొనసాగిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే ఈ పథకం ఎంతో కీలకమైనది. మూడుజిల్లాల రైతాంగానికి ప్రయోజనం కలిగించడమేకాక ఆయకట్టు సాగులోకి రావడం, ప్రజలకు తాగు నీటిని అందించవచ్చు. కూటమి ప్రభుత్వం రాకతో ఐదునెలలుగా పనులపైనా ప్రభావం చూపింది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియక కాంట్రాక్టు సంస్థ పనులపై ఆసక్తి చూపడం లేదు. ఈ పథకం పనులు కొనసాగించడం ద్వారా మూడు జిల్లాలకు కలిగే ప్రయోజనంపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



తంబళ్లపల్లె నియోజకవర్గం పుంగనూరు ఉప కాలువలోకి కృష్ణా జలాలు తరలించే లింక్ కాలువ

నిధులపై విచారణకు ఆదేశం

ప్రాజెక్టుల అనుసంధాన పథకం పనులపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వంలో చేపట్టిన ఈ పనులకు సంబంధించి టీడీపీకి చెందిన ప్రతినిధి చేసిన ఫిర్యాదుపై జలవనరులశాఖ కార్యదర్శి విచారణకు ఆదేశించినట్టు సమాచారం. గత ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థకు అయాచితంగా నిధుల విషయంలో ఏమైనా లబ్ధి చేకూరిందా, అలా జరిగివుంటే ఏ విధంగా జరిగింది అనే దానికి సంబంధించిన వివరాలను సేకరించి నివేదించేందుకు విచారణ అధికారిగా అనంతపురం ప్రాజెక్టు సీఈ నాగరాజును నియమించినట్టు తెలిసింది. పనులపై ఏ నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎలా ఉన్నా విచారణ పేరుతో కాలయాపన చేసేలా కనిపిస్తోంది.

జిల్లాను కరువు జాబితాలో చేర్చాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



ధర్నాలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కడప సెవెన్‌రోడ్స్ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేకపోవడం వల్ల కరువు సంభవించిందని, కేసీ కెనాల్ మినహా మిగిలిన అన్ని మండలాలను తక్షణమే కరువు జాబితాలో చేర్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో కరువు మండలాలను ప్రకటించలేదని విమర్శించారు. గాలేరు–నగరి, హంద్రీ–నీవా లాంటి ప్రాజెక్టు నిర్మాణాలను పూర్తి చేయకుండా పోలవరం జపం చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లిలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేస్తే అభ్యంతరం లేదని, అయితే విభజన హామీలో భాగమైన కడప స్టీల్ ప్లాంటు నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కొప్పర్తిలోని ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్‌ను కూడా అమరావతికి తరలించిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో భాగంగా రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు.చంద్రబాబు ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ. 6400 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రామ్మోహన్ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రుని జయంతి ఉత్సవాలు



మఠం ఆవరణంలో ఏర్పాటు చేసిన హోమంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు దంపతులు



మఠం ఆవరణలో కార్తీక దీపాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రభోదకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి అవతరించి 416 ఏళ్ల జయంతి ఉత్సవాలను బ్రహ్మంగారిమఠంలో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఎండోమెంట్ ఈఓ, మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. మఠం ఆస్థానం పండితులు జనార్దనచార్యులు పర్యవేక్షణలో హోమాలు, అభిషేకాలు, కళ్యాణం వంటివి నిర్వహించారు. ఇందులో పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి, రెండవ కుమారుడు భద్రయ్యస్వామి, మూడవ కుమారుడు వీరబొట్లయ్య స్వామి, నాల్గువ కుమారుడు దత్తయ్య స్వామి దంపతులు ఉత్సవాల కార్యక్రమాలలో పాల్గొని నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలలనుంచి భక్తులు తరలి వచ్చారు. అనంతరం చివరిరోజు గురువారం హోమాలు, నిర్వహించారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్



ప్రొద్దుటూరు కల్చరల్: అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, కేసులతో ఇబ్బంది పడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్ తెలిపారు. తనను, మేయర్ సురేష్‌బాబును కడప జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రతినిధులుగా నియమించడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ధన్యవాదాలు తెలిపారు. అక్రమ నిర్బంధాలకు గురవుతున్న సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం అందించడంతోపాటు తామున్నామనే భరోసా కల్పించి ఆత్మస్థైర్యాన్ని నింపుతామన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులను, లీగల్ సెల్ ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సోషల్ మీడియా కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తానని భరోసా కల్పించారు.

ఉత్సాహంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ తుదిదశకు చేరుకుంది. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన ఎంపికల ప్రక్రియ 5వ రోజు గురువారం కొనసాగింది. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన అభ్యర్థులకు తొలుత రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనంతరం పరుగు పందెం, పుల్లప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, లాంగ్‌జంప్, హైజంప్ నిర్వహించారు. ఎంపికల ప్రక్రియను ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ పర్యవేక్షించారు.

కొనసాగుతున్న వర్షాలు



కడప అగ్రికల్చర్: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండురోజులుగా వర్షాలు పడుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఒంటిమిట్టలో అత్యధికంగా 15.8 మి.మీ వర్షం కురవగా అత్యల్పంగా సింహాద్రిపురంలో 0.4 నమోదయింది. అలాగే బద్వేల్‌లో 14.6, సిద్దవటంలో 12.4, కలసపాడులో 8.4 , అట్లూరులో 8, కాశినాయనలో 7.2 , గోపవరంలో 5.6, సికెదిన్నెలో 4.8 , ఖాజీపేటలో 3.6 , కడపలో 3 , బి. కోడూరులో 1.8 , పోరుమామిళ్లలో 1.6 , బిమఠం, ఎర్రగుంట్ల, కొండాపురం, పొద్దుటూరు. వల్లూరులలో 1.4, చెన్నూరు, మైదుకూరు, చాపాడులలో 1.2 , సింహాద్రిపురంలో 0.4 మి.మీ నమోదయింది.

ఈ–కామర్స్ వైపు ప్రోత్సహించాలి

- సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని మహిళా పొదుపు సంఘాలను ఈ–కామర్స్ బిజినెస్ వైపు అడుగులు వేయించి ప్రపంచ గుర్తింపుతోపాటు సంపూర్ణ సాధికారిత సాధించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పరిధిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల పనుల పురోగతిపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంతోనే సాధ్యం అవుతుందన్నారు. సామాజిక భద్రతలో భాగంగా.. వృద్ధాప్య మహిళా సంఘాలను ఏర్పాటు చేసి.. ఆయా సంఘాల పటిష్టతకు కృషి చేయాలన్నారు. ప్రతి మండలం నుంచి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సరైన శిక్షణను అందివ్వాలన్నారు. జిల్లాలో అర్హతలు కలిగిన అన్ని స్వయం సహాయక సంఘాలకు రానున్న నాలుగు నెలల్లో నిర్దేశిత లక్ష్యం మేరకు కొత్త రుణాలను రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. సభ్యులందరికీ పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస గృహాలు అందుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్డీఏ, మెప్మా, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, జోయల్ విజయ్ కుమార్ లతో పాటు డీపీఎంలు, ఏపీడీలు, మెప్మా సి.ఎం.ఎం.లు, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ఎస్ఎం కేర్ సొల్యూషన్ జీఎంబీహెచ్ వారు జర్మన్ లాంగ్వేజ్ నేర్పించి ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. 35 ఏళ్లలోపు కలిగి జర్మనీ భాష నేర్చుకునే ఆసక్తి కలిగిన వారు అర్హులని వివరించారు. తిరుపతిలో ఆరునెలపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వేతనం రూ. 2,36,540 నుంచి రూ.3,18,419 వరకు ఉంటుందని .. ఈనెల 22వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 99888 53335, 99088 08914, 97002 10265 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

అసభ్యకరంగా ప్రవర్తించాడని కేసు నమోదు

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామానికి చెందిన మల్లయ్య వెంకటకృష్ణారెడ్డి తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని సచివాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మైథిలీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వేముల పోలీసులు కేసు నమోదు చేశారు. రోజూ సచివాలయానికి వెళ్లి ఆమెకి ఇబ్బంది కలిగిస్తూ వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వెంకటకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో పాత్రికేయుడు మృతి


సుబ్బరాయుడు (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం చలమారెడ్డిపల్లెలో నివాసముంటున్న సీనియర్ పాత్రికేయుడు నంద్యాల సుబ్బరాయుడు (51) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడి తలకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఈఓ

కడప అగ్రికల్చర్ : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని జిల్లా సహకార అధికారి సుభాషిణి పేర్కొన్నారు. గురువారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలన్నారు. డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈఓ రాజామణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ ప్రతినిధి పణిరున్, బ్యాంకు డీజీఎం ప్రతాప్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్ని కాపాడుకుందాం

కడప కల్చరల్ : ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను కళాత్మకంగా ప్రజలకు చేరవేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడమే ఎల్‌ఐసీ కళాజాత లక్ష్యం అని ఎల్‌ఐసీ ఉద్యోగుల కళాజాత నేతలు, సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, జోనల్ ఉపాధ్యక్షురాలు సుజాత అన్నారు. కడపలో ఎల్‌ఐసీ యూనియన్ కళా జాత ప్రదర్శన సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీల్, రైల్వేలు, ఆయిల్ రంగాల్లో సొంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కారణమన్నారు. వాటిని బలహీనపరచడం దేశానికి మంచి కాదన్నారు. యూనియన్ నేతలు గిరిధర్, మద్దిలేటి, నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం


బహుమతులు పొందిన చిన్నారులతో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం కడప నగర పరిధిలోని అక్కాయపల్లె బాలసదన్‌లో సాక్షి మీడియా ఆధ్వర్యంలో జేబీబీఎస్ ది ప్రిజెర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ అశోక్ సహకారంతో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలలు చదువుకున్నప్పుడు స్వేచ్ఛగా ఎదుగుతారన్నారు. కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు, పెద్దలు, గురువులు చెప్పే మాటలను శ్రద్ధగా ఆలకించాలని, బాధ్యతగా మెలగడం, క్రమశిక్షణతో నడుచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కొంతమంది చిన్నారులు మొబైల్ ఫోన్లకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఆధునిక సాంకేతికతను మంచి మార్గంలో వినియోగిస్తే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. బాలలు ప్రతిరోజు పుస్తకాలు చదవడం, పేపరు చదవడం అలవాటు చేసుకుని తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు బాలల సంక్షేమ కమిటీ కృషి చేస్తోందన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు చొరవ చూపడం అభినందనీయమన్నారు. డీసీపీఓ సుభాష్ యాదవ్ మాట్లాడుతూ బాల్యంలో కష్టపడితే జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సేవా లక్ష్యంగా తమ సంస్థ అనేక కార్యక్రమాలతో ముందుకు సాగుతోందన్నారు. తమ సంస్థ ద్వారా బాల్య వివాహాల అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ శారద, సిబ్బంది గీత, సునీతరాజు, గోవింద్, సునీత, కృష్ణ ప్రతిరూప్, ప్రసన్న, విజయ పాల్గొన్నారు.

చాచా నెహ్రూను స్ఫూర్తిగా తీసుకోవాలి



భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. ప్రధానమంత్రిగా క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ చిన్న పిల్లల కోసం తన సమయాన్ని వెచ్చించిన నెహ్రూ చరిత్రలో చాచాగా నిలిచిపోయారు.

\- అమూల్య, 4వ తరగతి

మహనీయులే ఆదర్శంగా..



దేశానికి సేవలు అందించిన మహనీయులను ఆదర్శంగా తీసుకుంటాను. ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని వారి పర్యవేక్షణలో ముందుకు సాగుతాను. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే నా ధ్యేయం.

\- కల్పన, 4వ తరగతి

దేశం గర్వించేలా ఎదుగుతా



నేను కష్టపడి చదివి దేశం గర్వించే స్థాయికి ఎదుగుతాను. ఇందుకు ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని నిర్ణయించాను. భవిష్యత్తులో పది మందికి సేవ చేయడమే లక్ష్యం.

\- రాగవి, 4వ తరగతి

చాచా నెహ్రూ సేవలు స్ఫూర్తిదాయకం



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన హయాంలో దేశ సమగ్రాభివృద్ధికి బాటలు వేశారు. బ్రిటీషు పాలనలో విధ్వంసమైన దేశాన్ని గాడిలో పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది.

\- సంగీత, 5వ తరగతి

ఇసుక టిప్పర్లు పట్టివేత

కొండాపురం : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం తెల్లవారుజామున మండలంలోని తిమ్మాపురం క్రాస్ వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కలసి పట్టుకున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిత్రావతి నది నుంచి రాత్రి వేళ ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి నిర్వహించి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో పెన్నానదిలో ఇసుకను అక్రమంగా రవాణా చేసేందుకు వెళ్లిన నాలుగు ఖాళీ ట్రాక్టర్లు, ఒక ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను గురువారం మధ్యాహ్నం పోలీసులు పట్టుకున్నారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు పోలీసులు పెన్నానదిలో దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దారు రమాకుమారికి అప్పగించారు. ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించి, ఖాళీ ట్రాక్టర్ల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహిళను బెదిరించిన యువకుడిపై కేసు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో మరియాపురానికి చెందిన ఓ మహిళను రాజారెడ్డి వీధికి చెందిన సుజిత్ అలియాస్ బన్నీ అనే యువకుడు డబ్బుల విషయమై బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజల కలలను హరించే బడ్జెట్ ఇది

వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల కలలను తీర్చేది కాదని, వారి కలలను హరించే బడ్జెట్ అని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఐదు నెలల తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్ లోపభూయిష్టంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలపై పన్నుల మోత తప్పదని ఈ బడ్జెట్ వల్ల అర్థం అవుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో దీపం పథకాన్ని మాత్రమే ఈ ఏడాది అమలు చేశారని, ఇదిగాక మరే పథకం అమలు చేయాలన్నా లక్ష కోట్లు అవసరమవుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలంటే రూ.4లక్షల కోట్లు కావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే ఆదాయం రూ. 2 లక్షల కోట్లు ఉంటే జీతాలు, అప్పులు, వడ్డీలకు 1.89 లక్షల కోట్లు కట్టాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎంబీ ప్రకారం అప్పులు తేవాలన్నా రూ.10వేల కోట్లకు మించి రాదని, పోనీ కేంద్రం ఏమైనా ఇస్తుందనుకుంటే ఈ 5 నెలల్లో ఇచ్చింది కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమేనన్నారు. మిగిలిన రూ.40వేల కోట్లను సర్దుబాటు చేయాలంటే ప్రజలపై పన్నుల రూపంలో భారం పడక తప్పదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి. శ్రీనివాసులరెడ్డి, చంద్రహాసరెడ్డి, ఎస్. ప్రసాద్‌రెడ్డి, సుబ్బరాయుడు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సీఎన్‌వీ సుబ్బారెడ్డి మరణం తీరని లోటు

ప్రొద్దుటూరు : ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చెమికల వెంకటసుబ్బారెడ్డి (సీఎన్‌వీ) మరణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజుపాళెం మండలంలోని తొండలదిన్నె గ్రామంలో జన్మించిన ఆయన అనేక జిల్లాల్లో డీఈఓగా, అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా, నవోదయ జాయింట్ డైరెక్టర్, తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా, యోగి వేమన యూనివర్సిటీ ఈసీ మెంబర్‌గా పనిచేసి అందరిని మన్ననలను పొందారని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఆయన చాలా సన్నిహితుడన్నారు. పార్టీతోపాటు వ్యక్తిగతంగా ఆయన మరణం తనకు తీరని లోటని పేర్కొన్నారు.

సేవాతత్పరుడు తిరుపాల్‌రెడ్డి

జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ సీఎం వైఎస్ జగన్


తిరుపాల్‌రెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

దువ్వూరు(చాపాడు) : రాజకీయ, విద్య, సామాజిక రంగాలలో ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి చేసిన కృషి ప్రశంసనీయమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేటకు చెందిన వ్యవసాయశాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ నేత ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి జీవితంపై డాక్టర్ తవ్వా వెంకటయ్య రచించిన దువ్వూరి సీమలో ఇరగంరెడ్డి అనే పుస్తకాన్ని గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడప జిల్లా రాజకీయాలలో ప్రధానంగా మైదుకూరు నియోజకవర్గంలో ఇరగంరెడ్డి వారి కుటుంబం రాజకీయంగానూ, విద్య, సామాజిక రంగాలలోనూ విశేషమైన కృషి చేస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యా వెలుగులు అందించారని కొనియాడారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యా, సౌకర్యాలు పెద్దగా లేని దువ్వూరు ప్రాంతంలో ఇరగంరెడ్డి కుటుంబం ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాదానం చేసిందన్నారు. తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబ చరిత్రను సంపూర్ణంగా అందించిన డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ తవ్వా వెంకటయ్య, ఇరగంరెడ్డి విజయ్‌గోపాల్‌రెడ్డి, జొన్నవరం వీరారెడ్డి, కేశవరెడ్డి, వీరంరెడ్డి సత్యనారాయణరెడ్డి, సిరిగిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వీరంరెడ్డి ప్రణీత్‌కుమార్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో మూడేళ్ల జైలుశిక్ష

బద్వేలు అర్బన్ : ఆత్మహత్యకు ప్రేరేపించి ఓ వ్యక్తి మృతి చెందడానికి కారణమైన ఇద్దరు ముద్దాయిలకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ తీర్పునిచ్చారు. బద్వేలు మండలం బోయనపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి రామసుబ్బారెడ్డి వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవాడు. బద్వేలు పట్టణంలోని ఆంజనేయనగర్‌లో నివాసం ఉంటూ చీటీల వ్యాపారం చేసే భూమిరెడ్డి శివారెడ్డి, అతని కుమారులకు సుమారు రూ.12 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అయితే రామసుబ్బారెడ్డి తన అప్పు చెల్లించాలని శివారెడ్డిని పదేపదే కోరుతున్నప్పటికీ అతను స్పందించకపోగా బెదిరించడంతో మనస్తాపానికి గురైన రామసుబ్బారెడ్డి 2014వ సంవత్సరం జనవరి 23వ తేదీన పట్టణంలోని శివాలయం సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామసుబ్బారెడ్డి కుమారుడు భూమిరెడ్డి రామక్రిష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అర్బన్ ఎస్‌ఐ నాగమురళి భూమిరెడ్డి శివారెడ్డి, భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నలుగురిపై చార్జిషీటు దాఖలు చేశారు. ఈ క్రమంలో బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి విచారణ చేసి సాక్షులను విచారించి రామసుబ్బారెడ్డి ఆత్మహత్యకు శివారెడ్డి, ఆయన భార్య, కుమారులు కారణమని నిరూపణ కావడంతో నలుగురికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. అయితే కేసు విచారణ సమయంలో శివారెడ్డి భార్య శాంతమ్మ (ఎ2), రెండవ కుమారుడు ఇంద్రసేనారెడ్డి (ఎ4) మృతి చెందారు. ఈ కేసులో సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజులను మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అభినందించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కె.రవిచంద్ర వాదనలు వినిపించారు.

వైద్య విద్యతో ఉన్నత శిఖరాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : వైద్య విద్యను అభ్యసించేందుకు వచ్చిన ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అడిషనల్ డీఎంఈ, కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సురేఖ ఆకాంక్షించారు. గురువారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ఆవరణంలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. సమాజంలో పేద ప్రజలకు చిత్తశుద్ధితో వైద్యసేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనరసమ్మ, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్ చిరువెళ్ల, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, డాక్టర్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

కడప మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. హైదరాబాదు నుంచి మూడు రైళ్లు, నాందేడ్ నుంచి ఒక రైలు నడుపుతున్నారని పేర్కొన్నారు.

- 07133 నెంబరుగల రైలు కాచిగూడలో ఈనెల 21, 28 తేదీలలో మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి కడప మీదుగా కొట్టాయంకు మరుసటిరోజు సాయంత్రం 6.50 గంటలకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో 07134 నెంబరుగల రైలు ఈనెల 15, 22, 29 తేదీలలో రాత్రి 8.30 గంటలకు కొట్టాయంలో బయలుదేరుతుందన్నారు. అలాగే 07135 నెంబరుగల రైలు హైదరాబాదులో ఈనెల 19, 26 తేదీల్లో బయలుదేరుతుంది. ఈ రైలు హైదరాబాదులో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి కడప మీదుగా మరుసటిరోజు సాయంత్రం 4.00 గంటలకు కొట్టాయంకు చేరుతుంది. తిరుగుప్రయాణంలో 07136 నెంబరుగల రైలు ఈనెల 20, 27 తేదీలలో సాయంత్రం 6.10 గంటలకు కొట్టాయంలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 11.40 గంటలకు హైదరాబాదు చేరుతుంది.
- 07139 నెంబరుగల రైలు నాందేడ్‌లో ఈనెల 16న ఉదయం 8.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10.30 గంటలకు కొల్లంకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 18న తెల్లవారుజామున 2.30 గంటలకు కొల్లంలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.00 గంటలకు సికింద్రాబాదు వరకు నడుస్తుంది.
- 07141 నెంబరుగల రైలు హైదరాబాదు మౌలాలిలో ఈనెల 23, 30 తేదీలలో మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10.30 గంటలకు కొల్లం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07142 నెంబరుగల రైలు ఈనెల 25, డిసెంబరు 2 తేదీలలో కొల్లంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.00 గంటలకు హైదరాబాదులోని మౌలాలి చేరుతుంది. అయ్యప్పస్వామి భక్తులు, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : కడప- చిత్తూరు ప్రధాన రహదారిలో గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కలకత్తా నుంచి బ్యాటరీల లోడుతో వస్తున్న లారీ మలుపులో అదుపు తప్పింది. అందులో ఉన్న ఒక వ్యక్తి సురక్షితంగా బయట పడ్డాడు.

సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. లారీలో బ్యాటరీలు ఉండడంతో రాత్రి వరకు కూడా లారీని అలాగే ఉంచారు. కాగా సురక్షితంగా బయట పడ్డ వ్యక్తి తాను క్లీనర్‌గా పేర్కొంటున్నాడు. దీంతో ప్రమాద సమయంలో లారీలో అతడు ఒక్కడే ఉండి స్వయంగా డ్రైవింగ్ చేశాడా లేక లారీలో అతనితో బాటు మరో వ్యక్తి ఉన్నాడా, ఒకవేళ ఉంటే అతడు డ్రైవింగ్ చేశాడా, ప్రమాదం జరగ్గానే భయంతో పరారయ్యాడా, లేకుంటే లారీ కింద ఇరుక్కుపోయాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

దూదేకులకు ఇచ్చిన హామీని విస్మరించిన చంద్రబాబు

కడప రూరల్ : దూదేకులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విస్మరించారని నూర్‌బాష దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా, జిల్లా అధ్యక్షుడు పగిడాల పెద్దన్న విమర్శించారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే దూదేకుల సంక్షేమానికి ప్రతి ఏటా రూ.100 కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నాగూరు కుళాయప్ప, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, సెక్రటరీ రెడ్డెయ్య పాల్గొన్నారు.

డీఏవీ భారతిలో సంబరంగా బాలల దినోత్సవం


బహుమతులు పొందిన చిన్నారులతో పరిశ్రమ ప్రతినిధులు, ప్రిన్సిపల్

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో వెలసిన డీఏవీ భారతి విద్యామందిర్‌లో బాలల దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిశ్రమ ప్రతినిధులు సుబ్బలక్ష్మి సాయి రమేష్ (కోర్ అడ్వైజర్), చీఫ్ మేనేజర్ అడ్మిన్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ శివ్వాం కిషోర్ కుమార్, సంగీత చాచా (మేనేజర్ ట్రైనింగ్ అండ్ కమ్యూనికేషన్) ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్ హౌస్ కాంపిటీషన్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోటీలో ఇలాగే విజయం సాధించాలని వారు విజేతలకు సూచించారు. ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవరచుకుని విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పోటీలలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో భారతి విద్యార్థులు విజయ కేతనం ఎగుర వేశారన్నారు. కాగా ప్లాంట్ సీఎంఓ సాయి రమేష్, డీఏవీ సౌత్ జోన్ ప్రాంతీయ అధికారి వీఎస్ఎన్‌కే శేషాద్రి విద్యార్థులను, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

గుండెపోటుతో బాలిక మృతి

బాలల దినోత్సవం రోజు విషాదం


లక్ష్మీదీపిక (ఫైల్)

పోరుమామిళ్ల: బాలల దినోత్సవం రోజునే గుండెపోటుతో 13 సంవత్సరాల బాలిక మృతి చెందటం అందరినీ కలచివేసింది. రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్‌కు చెందిన పల్లెంశెట్టి లక్ష్మీదీపిక(13) గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. స్థానిక వెంగమాంబ పాఠశాలలో ఈ బాలిక 9 వతరగతి చదువుతున్నట్లు తండ్రి పండరి తెలిపారు. చిన్న వయసులో గుండెపోటుకు గురికావడం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, బీజేపీ నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి, తండ్రి పండరికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

రేపటి నుంచి ఏఐఎస్‌ఎఫ్ 20వ జిల్లా మహాసభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 16, 17,18 తేదీల్లో కడపలో ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వల్లరాజు తెలిపారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు హాజరవుతారన్నారు. విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు ఈ మహాసభ వేదిక కానుందని తెలిపారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి తేజ, ఉపాధ్యక్షుడు చంద్ర, అరుణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా

త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు


త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న గోసా మనోహర్, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అన్యాయంగా తమపై కేసులు పెడతారా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. గత రెండేళ్లుగా టీడీపీ నాయకులు తనపై పెట్టిన పోస్టింగ్‌లకు సంబంధించి కేసు నమోదు చేయాలని కోరుతూ ఆయన గురువారం త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డికి ఫిర్యాదు చేశారు. నోరులేని మూగ జీవాలైన ఆవులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తే .. వాటిని కూడా వదలని అరాచకుడు రాచమల్లు అని, దేవుని భూములు స్వాహా, ప్రొద్దుటూరులో షాడో ఎమ్మెల్యే, ఇసుక బకాసురుడు... ఇలా ఎన్నో రకాలుగా తనపై పోస్టులు పెట్టారని రాచమల్లు పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండగానే ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి తనకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టించారన్నారు. ఈ అంశాలపై విచారించి చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది

ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందని తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకటించారని రాచమల్లు తెలిపారు. తానే సోషల్ మీడియాలో పోస్టులు పెడతానని చెప్పారన్నారు. తమ కార్యకర్తలపై కేసులు పెట్టడానికి జైళ్లు సరిపోవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు అన్యాయంగా కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది మహిళలు, చిన్నారులు అఘాయిత్యాలకు గురైనా ప్రభుత్వం స్పందించలేదన్నారు. వీటిని పట్టించుకోని ప్రభుత్వం అన్యాయంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు నమోదు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు వెంట జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.